# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 25-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- మధ్యప్రదేశ్‌లో దేశంలోని మొట్టమొదటి బహుళార్ధసాధక కెన్-బెత్వా జాతీయ నదుల అనుసంధాన ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు.
- కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాలను ప్రోత్సహిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త బలం చేకూరుస్తోందని కేంద్ర సహకార మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- ఆకాశవాణి, దూరదర్శన్ ద్వారా ప్రజలకు ఉత్తమమైన కార్యక్రమాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ అన్నారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29న ప్రసారమవుతుంది.

==========================

మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలో దేశంలోని మొట్టమొదటి ప్రతిష్టాత్మకమైన, బహుళార్ధసాధక కెన్-బెత్వా జాతీయ నదుల అనుసంధాన ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు శంకుస్థాపన చేశారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా దేశంలోని మొట్టమొదటి ఓం కారేశ్వర్ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్ట్‌ను ప్రధానమంత్రి ప్రారంభించి, 1,153 అటల్ గ్రామ్ సుశాసన్ భవన్‌ల భూమి పూజను నిర్వహించారు. అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారకార్థం ఒక స్టాంపు, నాణేన్ని నరేంద్ర మోదీ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సుపరిపాలన, ఉత్తమ సేవలను అందించడంలో వాజ్ పేయి తమకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిచ్చారని అన్నారు. భారతదేశ నీటి వనరుల నిర్వహణ, ఆనకట్ట నిర్మాణాన్ని బలోపేతం చేయడానికి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దార్శనికత, దూరదృష్టి గణనీయంగా దోహదపడ్డాయని పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

==========================

దేశంలో అంతర్గత భద్రత, శాంతిని నెలకొల్పడంలో సీఆర్పీఎఫ్ కీలక పాత్ర పోషిస్తున్నదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ కార్యాచరణ పరిపాలనా సామర్థ్యంపై కేంద్ర హోం మంత్రి ఈరోజు న్యూఢిల్లీలోని ప్రధాన కార్యాలయంలో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... నక్సలిజాన్ని అరికట్టడంలో ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూ కాశ్మీర్‌లో శాంతి, సుస్థిరతను పునరుద్ధరించడంలో కేంద్ర సాయుధ పారామిలటరీ దళం సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. కారుణ్య నియామకాలతో సహా, అమరవీరులైన జవాన్ల కుటుంబాల కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను హోం మంత్రికి CRPF డైరెక్టర్ జనరల్ అనిష్ దయాళ్ సింగ్ వివరించారు.

==========================

భారతదేశం 2047 నాటికి 30 ట్రిలియన్ అమెరికా డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుకునే అవకాశం ఉందని నీతి ఆయోగ్ మాజీ సిఇఒ అమితాబ్ కాంత్ అన్నారు. బీహార్ రాష్ట్రం పాట్నాలోని రాజ్‌భవన్‌లో సుపరిపాలన దినోత్సవం సందర్భంగా ఈ రోజు అమితాబ్ కాంత్ ప్రత్యేక స్మారక ఉపన్యాసం చేశారు. తయారీ ఎగుమతుల్లో వృద్ధిని సాధించడం ద్వారా ఈ ఘనత సాధించవచ్చని తన ఉపన్యాసంలో ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు భారతదేశం తన జాతీయ జిడిపిని 9 రెట్లు, తలసరి ఆదాయాన్ని 8 రెట్లు, తయారీ సామర్థ్యాన్ని 16 రెట్లు వేగవంతం చేయాలని సూచించారు.

==========================

పూర్వ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా ఈ రోజు ఢిల్లీలోని సదైవ్ అటల్ స్మారక చిహ్నంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు అటల్ బిహారీ వాజ్‌పేయికి నివాళులర్పించారు.

==========================

ఆకాశవాణి, దూరదర్శన్ ద్వారా ప్రజలకు ఉత్తమమైన కార్యక్రమాలను అందించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ అన్నారు. జార్ఖండ్‌లో అధికారిక పర్యటనలో ఉన్నమంత్రి ఈరోజు పాలములోని డాల్తోగంజ్‌లోని ఆకాశవాణి, దూరదర్శన్ ప్రాంతీయ కేంద్రాలను సందర్శించారు. మంత్రి తన అభిప్రాయాలను ప్రేక్షకులతో పంచుకునేందుకు ఆకాశవాణి స్టూడియో నుండి ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెండు స్టేషన్ల అధికారులు పాల్గొన్నారు.

విరామం

==========================

కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాలను ప్రోత్సహిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త బలం చేకూరుస్తోందని కేంద్ర సహకార మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన 10 వేలకు పైగా బాహుళ ప్రయోజన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డెయిరీ, మత్స్య సహకార సంఘాలను ఈ రోజు ఆయన జాతికి అంకితం చేశారు. న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో కొత్తగా ఏర్పడిన సహకార సంఘాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, రూపే కిసాన్ క్రెడిట్ కార్డ్‌లు, మైక్రో ATMలను అమిత్ షా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఐదేళ్ల లక్ష్యం కంటే ముందుగానే ప్రభుత్వం రెండు లక్షల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా రైతుల ఉత్పత్తులు సులువుగా ప్రపంచ మార్కెట్‌కు చేరుతాయని ఆయన పేర్కొంటూ..

(వాయిస్ 32 సెకన్లు)

==========================

పూర్వ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సుపరిపాలన దినోత్సవం సందర్భంగా ఈ రోజు ఢిల్లీలో రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ రాష్ట్ర పర్వ్ వెబ్‌సైట్ యాప్‌ను ప్రారంభించారు. గణతంత్ర దినోత్సవ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, బీటింగ్ రిట్రీట్, టేబుల్ యాక్స్ వంటి జాతీయ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ఈ వెబ్‌సైట్ సాధారణ ప్రజలకు అందజేస్తుందని రాజేష్ కుమార్ సింగ్ అన్నారు. ఏదైనా ప్రత్యేక కార్యక్రమ నిర్వహణ సమయంలో టికెట్, పార్కింగ్, సీటింగ్ ఏర్పాట్లకు సంబంధించిన సమాచారాన్ని కూడా పౌరులకు ఈ వెబ్‌సైట్ అందిస్తుందని తెలిపారు.

==========================

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో కీలక ప్రయోగం చేపట్టబోతోంది. ఈనెల 30వ తేదీ రాత్రి 9 గంటల 58 నిమిషాలకు సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్లోని తొలి ప్రయోగ వేదిక నుంచి PSLV-C60 రాకెట్ ను నింగిలోకి పంపనుంది. స్పాడెక్స్ అనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన 220 కిలోల రెండు ఉపగ్రహాలను రాకెట్ ద్వారా 470 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలో ప్రవేశపెట్టనుంది. ఈ మిషన్ ద్వారా ప్రపచంలో భారత్ రెండు అంతరిక్ష వాహనాలను కలిపే సాంకేతిక డాకింగ్ ను కలిగి ఉన్న నాల్గవ దేశంగా అవతరించనుంది.

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

==========================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు న్యూఢిల్లీలో 7 విభాగాల్లో అసాధారణ విజయాలు సాధించిన 17 మంది పిల్లలకు ‘ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్’ ప్రదానం చేయనున్నారు. కళలు, సంస్కృతి, శౌర్యం, ఆవిష్కరణలు, శాస్త్ర,సాంకేతిక, సామాజిక సేవ, క్రీడలు, పర్యావరణ రంగాలలో సాధించిన విజయాలకు ప్రభుత్వం బాల పురస్కారాన్ని అందజేస్తుంది. ప్రతి అవార్డు గ్రహీత పతకంతో పాటు ధ్రువపత్రం, ప్రశంసా పత్రాన్ని అందుకుంటారు.

==========================

==========================